క్లుప్తంగా

ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించాలి

చాట్రాయి: మండుటెండలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం ఇబ్బందులు పెడుతోందని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం అన్నారు. మండలంలోని చిన్నంపేట గ్రామంలో ఉపాధి కూలీలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా వేతనాలు ఇవ్వకపోతే కూలీలు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. మండుతున్న ఎండల్లో పనిచేస్తుంటే కనీసం సేద తీర్చుకునేందుకు నీడ కల్పించలేకపోతున్నారని, పని ప్రదేశంలో టెంటు ఏర్పాటు చేయాలని, వారం వారం వేతనాలు చెల్లించాలని ఆయన కోరారు.

రెడ్డిగూడెం మండలంలో 85.38 శాతం ఉత్తీర్ణత


మల్లాది ప్రవల్లిక (572)


అడపా తేజస్వి (586)

జి.కొండూరు: పదో తరగతి ఫలితాల్లో మండల పరిధిలోని ఏడు ప్రభుత్వ, రెండు ప్రైవేటు పాఠశాలలు కలిపి 85.38 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. వీరిలో రెడ్డిగూడెం గీతాంజలి ఇంగ్లిష్ మీడియం విద్యార్థిని అడపా తేజస్వి 586 మార్కులతో మండల ప్రథమ స్థానంలో నిలిచింది. రంగాపురం ఏపీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థిని మల్లాది ప్రవల్లిక 572 మార్కులతో ప్రభుత్వ పాఠశాలల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది.

నిరుద్యోగ యవతకు ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు స్క్రీన్ ప్రింటింగ్, పెయింటింగ్ ఆర్టికల్స్ కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ తరగతులు ఈ నెల 28వ తేదీన ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలోనే ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని, ఆసక్తి ఉన్న వారు 28వ తేదీ లోగా తమ సంస్థ కార్యాలయానికి స్వయంగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్: 0866–2470240 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

మైలవరం మండలంలో 82 శాతం ఉత్తీర్ణత


జిల్లా ఫస్ట్ ర్యాంకర్ హర్షిత్‌ను అభినందిస్తున్న దృశ్యం

మైలవరం: పదో తరగతి ఫలితాల్లో మైలవరం మండలంలో 82 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ ఎల్. బాలు బుధవారం తెలిపారు. మండలంలో 9 ప్రభుత్వ పాఠశాలలు, 6 ప్రైవేట్ పాఠశాలల నుంచి మొత్తం 1,017 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 839 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 557 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 400 మంది ఉత్తీర్ణులయ్యారు. మైలవరం ఎంబీఎం జెడ్పీ పాఠశాలకు చెందిన వసుపులేటి నందిని 593 మార్కులతో మండలంలో ప్రథమస్థానంలో నిలిచింది, ద్వితీయ స్థానంలో మందా స్నేహలత 575, తనుశ్రీ యామిని 570 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచింది. ప్రైవేట్ పాఠశాలల నుంచి 460 మందికి గాను 439 మంది ఉత్తీర్ణులయ్యారు. మైలవరం శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థి వి. హర్షిత్ 597 మార్కులు సాధించి ఎన్టీఆర్ జిల్లాలో ఫస్ట్ ర్యాంకు, వి. అభినవ్ 590 మార్కులతో స్కూల్ సెకండ్ వచ్చారని పాఠశాల ఏజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ వినోద్ తెలిపారు. వెల్వడం లకిరెడ్డి పాపులమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 49 మంది విద్యార్థులు హాజరు కాగా 35 మంది ఉత్తీర్ణులయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జడ్. నరసింహారెడ్డి తెలిపారు.

గంపలగూడెం విద్యార్థుల విజయదుందుభి


గంపలగూడెం మోడల్ స్కూల్లో విద్యార్థినికి మిఠాయి తినిపిస్తున్న ఉపాధ్యాయినులు


ఉమాతులసి | సాయి సుప్రజ | ప్రవల్లిక

తిరువూరు: పదో తరగతి ఫలితాల్లో గంపలగూడెం మండలం నెమలి జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రథమస్థానంలో నిలిచింది. ఈ పాఠశాల విద్యార్థులు 92 శాతం ఉత్తీర్ణులయ్యారని మండల విద్యాశాఖాధికారి తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో గంపలగూడెం లిటిల్ ఏంజెల్స్ స్కూల్ విద్యార్థి వంగల ఉమా తులసి 585 మార్కులు, అదే పాఠశాలకు చెందిన కేతేపల్లి సాయి సుప్రజ కూడా 585 మార్కులు సాధించారు. ఊటుకూరు సిద్ధార్థ స్కూల్ విద్యార్థిని మంగొల్లు ప్రవల్లిక 583 మార్కులు సాధించగా, గంపలగూడెం జెడ్పీ హైస్కూలుకు చెందిన శిరీష 577 మార్కులు పొందారు. పెదకొమెర సాయిగాయత్రి స్కూల్ విద్యార్థిని జె. వర్షిత 582, ఊటుకూరు కేరళ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థి ఆర్. అక్షయ 576, గుళ్లపూడి వివేకానంద స్కూల్ విద్యార్థి బి. ప్రియాంక 546, పెదకొమెర శాన్ జోస్ స్కూల్ విద్యార్థి పి. భరత్ 570, సరస్వతి విద్యాలయం విద్యార్థి పి. ప్రవల్లిక 535, గంపలగూడెం గీతాంజలి స్కూల్ విద్యార్థి ఎం. సిరి 577, అమ్మిరెడ్డిగూడెం ఏబీఎం స్కూలు విద్యార్థి జి. రాజేశ్వరి 525, మోడల్ స్కూల్ విద్యార్థి జి. యోగామృత 559, కేజీబీవీ స్కూల్ విద్యార్థి ఎం. కృష్ణవేణి 539, తునికిపాడు జెడ్పీ స్కూల్ విద్యార్థి ఉష యశస్విని 513, కనుమూరు జెడ్పీ విద్యార్థి హేమంత్ రెడ్డి 572, గంపలగూడెం జెడ్పీ విద్యార్థి ఎస్. శిరీష 577, పెనుగొలను జెడ్పీ విద్యార్థి కె. సన 540, సత్యాలపాడు జెడ్పీ విద్యార్థి ఎం. శివగోపాల కృష్ణ 493, అర్లపాడు జెడ్పీ విద్యార్థి ఎం. అర్చన 540, ఊటుకూరు జెడ్పీ విద్యార్థి టి. పవన్ 564 మార్కులతో ఆయా పాఠశాలల్లో అగ్రగామిగా నిలిచారని ఎంఈఓ వివరించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పొలాలు దగ్ధం


కొటికలపూడిలో దగ్ధమైన మొక్కజొన్న పొలం

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మొక్కజొన్న పొలాలు దగ్ధమైన ఘటన మండలంలోని కొటికలపూడి గ్రామంలో బుధవారం మధ్యాహ్నం సుమారు రెండు గంటల సమయంలో జరిగింది. ఈ ప్రమాదంలో గ్రామంలోని 15 మంది రైతులకు చెందిన సుమారు 25 ఎకరాల మొక్కజొన్న పైరు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. పొలాల్లో ఉన్న రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద షార్ట్ సర్క్యూట్ జరగడం వల్లే పంటపొలాలు దగ్ధమైనట్లు రైతులు తెలిపారు. విద్యుత్ శాఖాధికారులు వేసవిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద తగిన జాగ్రత్తలు చేపట్టక పోవడంతో ప్రమాదం జరిగిందని అనుమానిస్తున్నారు. రైతుల ద్వారా సమాచారం అందుకున్న అగ్నిమాపక దళ సిబ్బంది మంటలను అదుపు చేశారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.15 నుంచి రూ.20 లక్షల వరకు పంట నష్టం జరిగి ఉంటుందని భావిస్తున్నారు. ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్, సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం ఇప్పించాలని బాధితులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ అయ్యప్ప టెంపుల్ ఫీడర్, దత్త రోడ్ ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా గురువారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఈఈ పి. రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సజ్జ భవానీ ప్రసాద్ అపార్ట్‌మెంట్, మిత్రా డాబా, త్రిబుల్ ఎస్ కాలనీ, హెడ్ పోస్టాఫీస్, మధుసూదన టింబర్ డిపో ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

వికాస్ విద్యార్థుల ప్రభంజనం


లక్ష్మీప్రియ | అమృత | సృజన | డింపుల్ అశ్లేష | హర్షిత్
సాయిరాం | అక్షయ్‌కుమార్ | అజిత్‌కుమార్ | సునయన | మనీషా

విస్సన్నపేట: పదో తరగతి ఫలితాల్లో విస్సన్నపేట వికాస్ హైస్కూల్ విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారని వికాస్ విద్యా సంస్థల చైర్మన్ ఎస్. నర్సిరెడ్డి తెలిపారు. తమ పాఠశాలకు చెందిన దంతాల లక్ష్మీప్రియ 590 మార్కులు, బి. అమృత 584, ఎం. సృజిత 582, ఎం షణ్ముఖ ప్రియ 578, బి. గోపీకిరణ్ 576, షేక్ ఫిరదౌస్ 574, ఐ. మోనీషా 572, జి. గోకుల్‌కుమార్ రెడ్డి 570, డి. వరుణ్ ఆదిత్యాచారి 566, భరత్‌తేజ 565, కె. వైష్ణవి 565, కె. గణేష్‌బాబు 565 మార్కులు సాధించారని చెప్పారు. విస్సన్నపేట సిద్ధార్థ స్కూల్ విద్యార్థి కొరివి డింపుల్ అశ్లేష 584, జక్కుల హర్షిత్ 582, పీబీఎన్ సాయిరాం 581, పి. సాయిప్రసన్న 577, కె. వరదపూజిత 569, సీహెచ్ సుమనశ్రీ 569 మార్కులు సాధించారు. విస్సన్నపేట శ్రీనివాసా హైస్కూల్లో ములగల అజిత్‌కుమార్ 578 మార్కులు, విసంపల్లి అక్షయ్‌కుమార్ 578, పి. ఉమానాగశ్రీ సునయన 572, మద్దిరెడ్డి లక్ష్మీ సౌమ్యశ్రీ 571 మార్కులు సాధించారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

విస్సన్నపేట మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో 390 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 251 మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈఓ సుధాకర్ తెలిపారు. నరసాపురం గురుకుల పాఠశాల విద్యార్థిని బి. మనీషా 553 మార్కులతో మండల ప్రథమ స్థానంలో నిలిచింది. పుట్రేల జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని కంపా సోఫీ 547, విస్సన్నపేట జెడ్పీ స్కూలు విద్యార్థిని కె. కల్యాణి 537 మార్కులు సాధించారు.

తిరువూరు మండలంలో బాలికలదే పైచేయి


తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన బాలికలతో ఉపాధ్యాయులు


డింపుల్ నాగలక్ష్మి (596)

తిరువూరు: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో తిరువూరు మండలంలో బాలికలు అత్యధిక మార్కులు సాధించారు. ప్రభుత్వ పాఠశాలల స్థాయిలో తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని కె. తపస్వి, కోకిలంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి కె. మాధవసాయి 568 మార్కులు సాధించారు. తిరువూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వీసీఎస్ మణికంఠ 565, గానుగపాడు జెడ్పీ స్కూల్లో ఎస్. మేఘన 553, మునుకుళ్ల జెడ్పీ స్కూల్లో కె.పూజిత 551, ముష్టికుంట్ల జెడ్పీలో కె. చాందినీదేవి 541, తిరువూరు సాంఘిక సంక్షేమ గురుకులంలో ఎం. అక్షయప్రదీప్ 533, మల్లేల జెడ్పీ స్కూల్లో పి. జస్వంత్ 479 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమస్థానంలో నిలిచారు. ప్రైవేటు పాఠశాలల్లో శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థి జయంత్ కృష్ణ, గీతమ్స్ స్కూల్ విద్యార్థిని వై. డింపుల్ నాగలక్ష్మి 596 మార్కులు సాధించారు. నారాయణ స్కూల్ విద్యార్థి అంజిబాబు 593 మార్కులు సాధించాడు. నాగార్జున స్కూల్‌లో జి. సుస్మితా రెడ్డి 587, సిద్ధార్థ స్కూల్‌లో ఎస్. లీలాకుమారి 584, శ్రీనిధి స్కూల్లో శ్రీవర్షిత 581, భాష్యం స్కూల్లో సీహెచ్ వర్షిత 572, వివేకానంద స్కూల్లో వి. చరిత 523, విజ్ఞాన్ స్కూల్లో వైభవ్ 483, కృష్ణవేణి స్కూల్లో కె. ప్రశాంత్ కుమార్ 357 మార్కులతో పాఠశాల స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మొత్తం 911 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా 765 మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈఓ శ్యాంకుమార్ తెలిపారు.

వైభవంగా దాసాంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ


స్వామివారికి పూజలు


విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భక్తులు

మైలవరం: గణపవరం దాసాంజనేయస్వామి ఆలయంలో దాసాంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ నెల 18 నుంచి బ్రహ్మశ్రీ ఎల్. పాండురంగశాస్త్రి, కంచి పీఠ ఆస్థాన సిద్ధాంతి, ప్రభుత్వ దేవాలయం ఆగమ సలహాదారులు బ్రహ్మశ్రీ ఎల్. విజయ సుబ్రహ్మణ్యం సిద్ధాంతి గురువులు అధ్వర్యంలో రుత్వికులు, వేదపండితుల సహాయ సహకారాలతో ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారిని పూలమాలలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ధ్వజ స్తంభం వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. పూజల అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తిరువూరు చైర్‌పర్సన్ కస్తూరిబాయి రాజీనామా



తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని ఆమె అధ్యక్షతన బుధవారం జరిగింది. తొలుత తాను సమర్పించిన రాజీనామా లేఖకు కట్టుబడి సమావేశంలో తాను పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించి మినిట్స్‌లో సంతకం చేశారు. ఆమె రాజీనామా లేఖను ఉన్నతాధికారులకు పంపి తదుపరి చర్యలు తీసుకుంటామని కమిషనర్ లోవరాజు తెలిపారు.

నాలుగేళ్ల వివాద రహిత పాలన..

తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్‌గా గత్తం కస్తూరిబాయి వివాదరహితంగా పని చేశారని కౌన్సిలర్లు పేర్కొన్నారు. నిధుల కొరత ఉన్నప్పటికీ పట్టణాభివృద్ధికి, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇచ్చారని పలువురు అభినందించారు. పట్టణంలోని పలు వార్డుల్లో గతంలో అధ్వానంగా ఉన్న రహదారులను అభివృద్ధి చేశారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన గ్రాంట్లు, నిధులను సద్వినియోగం చేసుకుని ప్రజావసరాలు తీర్చడానికి ప్రాధాన్యమిచ్చారని చెప్పారు. పట్టణంలోని మూడో వార్డు నుంచి ఏకగ్రీవంగా కౌన్సిలర్‌గా ఎన్నికైన కస్తూరిబాయి గత పాలకవర్గంలోనూ కౌన్సిలర్‌గా సేవలందించారు. పార్టీ ఆదేశానుసారం తన పదవికి కస్తూరిబాయి రాజీనామా చేశారు.

నూతన వధూవరులకు ప్రతాప్ ఆశీర్వాదం



ఆగిరిపల్లి: ఆగిరిపల్లికి చెందిన బొట్ల హేమంత్, పూజిత వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీటీసీ సాధం గోపి, జిల్లా వక్ఫ్ బోర్డ్ మాజీ సభ్యులు షేక్ సుభాని, వైఎస్సార్ సీపీ ఆగిరిపల్లి గ్రామ అధ్యక్షుడు చిమట శ్రీనివాసరావు, నాయకులు బొట్ల బ్రహ్మం, విష్ణు, కంబాల ప్రదీప్, బొబ్బర్ల సురేష్ పాల్గొన్నారు.

ఆలయ హుండీ కానుకల లెక్కింపు

నూజివీడు: గొల్లపల్లి రఘునాథస్వామి ఆలయంలో బుధవారం హుండీ కానుకలను లెక్కించారు. హుండీ కానుకల ఆదాయం రూ.1.61 లక్షలు వచ్చాయని ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష్‌కుమార్ తెలిపారు. దేవదాయశాఖ గన్నవరం ఇన్‌స్పెక్టర్ కె. అనురాధ పర్యవేక్షణలో హుండీ కానుకల లెక్కింపు జరిగిందన్నారు. రఘునాథస్వామి ఆలయానికి చెందిన భూముల కౌలు హక్కుకు వేలం నిర్వహించగా రూ.12.11 లక్షలు వచ్చాయన్నారు. గతంలో ఇదే భూమికి రూ.5.19 లక్షలు మాత్రమే రాగా ఈ దఫా కౌలు సొమ్ము పెరిగిందన్నారు.

అంతులేని నష్టం.. అందని సాయం

- అకాల వర్షాలకు పడిపోయిన మొక్కజొన్న పంట
- ప్రాథమిక అంచనాలతో చేతులు దులుపుకున్న ప్రభుత్వం
- పరిహారం కోసం ఆశగా ఎదురు చూస్తున్న రైతులు
- నియోజకవర్గంలో 196 హెక్టార్లలో పంట పడిపోయినట్లు ప్రాథమిక అంచనా





చెర్వుమాధవరం గ్రామంలో నేల వాలిన మొక్కజొన్న పైరు : పడిపోయిన మొక్కజొన్న పంటలో వర్షానికి తడిసి నల్లగా మారిన మొక్కజొన్న కంకులు

జి.కొండూరు: ఇటీవల కురిసిన అకాల వర్షాలు మొక్కజొన్న రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి. పెనుగాలులతో కూడిన వర్షాలు కురవడంతో రబీలో ఆలస్యంగా సాగు చేసిన మొక్కజొన్న గింజ పట్టే సమయంలో నేల వాలడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. వ్యవసాయాధికారులు అరకొరగా ప్రాథమిక అంచనాలను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపారు. నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం ఎటువంటి సూచనలు చేయలేదు. దీనితో ఎన్యూమరేషన్ చేయాల్సిన అధికారులు ప్రభుత్వ అనుమతి లేకపోవడంతో వేచి చూస్తున్నారు. పరిహారం వస్తుందో, లేదో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు.

మైలవరం నియోజకవర్గంలోరబీ మొక్కజొన్న సాగు, పంట నష్టం వివరాలు హెక్టార్లలో

మండలం	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	పడిపోయింది (హెక్టార్లలో)	ప్రభావిత గ్రామాలు	ప్రభావిత రైతులు
జి.కొండూరు	373.29	46	07	52
మైలవరం	753.35	50	12	58
రెడ్డిగూడెం	236.18	35	06	58
ఇబ్రహీంపట్నం	660.07	65	05	56

తీవ్ర నష్టాల్లో రైతులు..

ఈ ఏడాది మైలవరం నియోజకవర్గంలో రబీలో 2,022.89 హెక్టార్లలో మొక్కజొన్న సాగు చేయగా ముందస్తు కోతలు పూర్తయిన మొక్కజొన్నలను కొనే నాథుడే లేక మైలవరం మార్కెట్ యార్డు, రహదారులపై రాశులుగా పోసి ఉంచారు. అకాల వర్షాలతో కొంతమేర మొక్కజొన్నలు తడిసిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఇదిలా ఉంటే పెను గాలులతో కూడిన వర్షానికి ఆలస్యంగా సాగు చేసిన మొక్కజొన్న నియోజకవర్గంలో 196 హెక్టార్లలో నేలకొరిగింది. నేలకొరిగిన మొక్కజొన్నలో గింజ పట్టే దశలో ఉన్న పైరులో తీవ్ర నష్టం వాటిల్లింది. కొద్ది రోజుల్లో కోతకు సిద్ధంగా ఉన్న పంట సైతం నేలకొరగడంతో కంకులు నల్లగా మారి మొక్కజొన్నలు కూడా రంగు మారే అవకాశం ఉండడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి కౌలుతో కలిపి రూ.50 వేల వరకు పెట్టుబడి పెట్టిన రైతులు పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

వర్షానికి పడిపోయింది



రెండు ఎకరాలు కౌలుకి తీసుకు మొక్కజొన్న సాగు చేశా. ఇటీవల వచ్చిన గాలీవానకు మొక్కజొన్న మొత్తం నేలవాలింది. మొక్కజొన్న గింజ పోసుకునే దశలో పడిపోవడం వల్ల తీవ్ర నష్టం జరిగింది. కోత కోసినప్పటికీ సగం కూడా దిగుబడి రాదు. ప్రభుత్వం పరిహారం అందిస్తే కొంతమేర మేలు జరుగుతుంది.

– జరపల రాంజీ నాయక్, రైతు, చెర్వుమాధవరం

రెండున్నర ఎకరాలు నష్టపోయా



ఎనిమిది ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. ఇటీవల వచ్చిన గాలీవానకు రెండున్నర ఎకరాలు నేల వాలింది. గింజ పోసుకునే సమయంలో నేల వాలడంతో గింజలు తాలుగా మారి తీవ్ర నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలి.

– కలతోటి కొండలరావు, రైతు, జూపూడి గ్రామం

ఉగ్ర దాడులకు నిరసనగా క్యాండిల్ ర్యాలీలు





ఇబ్రహీంపట్నంలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి జోగి రమేష్, నాయకులు : తిరువూరులో కొవ్వొత్తులతో ముస్లింల ప్రదర్శన

తిరువూరు: పహల్గామ్‌లో ఉగ్రవాదులు టూరిస్టులపై దాడిచేసిన ఘటనను నిరసిస్తూ తిరువూరు జామియా మసీదు ఎదుట బుధవారం రాత్రి కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముస్లింలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉగ్రవాదుల దాడి అమానుషని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని కోరారు. జామియా మసీదు కమిటీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

ఇబ్రహీంపట్నం: కశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగా ఇబ్రహీంపట్నంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రి జోగి రమేష్ హాజరై మృతుల కుటుంబాలకు నివాళులర్పించారు. పహల్గాం ఘటనను దేశవ్యాప్తంగానే కాకుండా యావత్ ప్రపంచం ఖండిస్తోందని జోగి రమేష్ అన్నారు. భూలోక స్వర్గంగా భావించే కశ్మీర్‌లో ఉగ్రవాదులు నరమేధం సృష్టించడం దుర్మార్గమన్నారు. ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ర్యాలీలో జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు మేడపాటి నాగిరెడ్డి, జోగి రాము, రెంటపల్లి నాగరాజు, పోరంకి శ్రీనివాసరాజు, మిక్కిలి శరభయ్య, పచ్చిగోళ్ల పండు, గరికపాటి రాంబాబు, దయాకర్, ప్రకాశ్, కోటేశ్వరరావు, బేగ్, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి మండలంలో 70 శాతం ఉత్తీర్ణత



మండల టాపర్ జనార్దన్ బాబును అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆగిరిపల్లి: పదో తరగతి పరీక్షలకు మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 378 మంది హాజరుకాగా 264 మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ సర్వేశ్వరరావు తెలిపారు. ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 157 మంది విద్యార్థులకుగాను 117 మంది, ఈదర జిల్లా పరిషత్ హైస్కూల్లో 75 మందికిగాను 53 మంది, అడవి నెక్కలం జెడ్పీ పాఠశాలలో 55 మందికిగాను 35 మంది, సురవరం జిల్లా పరిషత్ హైస్కూల్లో 44 మందికిగాను 27 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. సురవరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని జి.జనార్దన్ బాబు 588 మార్కులతో మండల ప్రథమ స్థానం, 584 మార్కులతో ఆగిరిపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థి నక్కా నాగ త్రివేణి ద్వితీయ స్థానం సాధించారని చెప్పారు.

గేదె చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

చాట్రాయి: పాడి గేదె చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వివరాల ప్రకారం .. తుమ్మగూడెంకు చెందిన కంచర్ల దశరథం తన ఇంటి సమీపంలో ఉన్న స్థలంలో ముళ్ల తీగ ఏర్పాటు చేసి రెండు గేదెలను మంగళవారం రాత్రి కట్టేశాడు. బుధవారం ఉదయం పాలు తీద్దామని వెళ్లగా ఫెన్సింగ్ కట్ చేసి ఉండటం, ఒక గేదె కనిపించకపోవడాన్ని గుర్తించాడు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సాయంత్రం చాట్రాయి గొల్లగూడెం వద్ద వ్యానులో దొంగిలించిన గేదెను గుర్తించారు. గేదె చోరీకి పాల్పడిన నిందితుడు చిట్టిపూతల చిన్నారావును అరెస్టు చేసి వ్యానుని, గేదెను స్వాధీనం చేసుకున్నారు.

ముసునూరులో 75 శాతం ఉత్తీర్ణత



కె.సాయి సింధు (578)



దివ్య హర్షిణి (571)

ముసునూరు: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో 75 శాతం ఉత్తీర్ణత శాతం సాధించారని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. మండలంలోని ఏడు జెడ్పీ హైస్కూళ్లు, ఒక గురుకుల విద్యాలయం నుంచి 452 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 340 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు వి.దివ్యహర్షిణి 571 మార్కులు, కె.కీర్తన 569 మార్కులతో మండల ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు.

గురుకుల బాలికలు 99 శాతం ఉత్తీర్ణత..

ముసునూరులోని ఆంధ్రప్రదేశ్ గురుకుల బాలికల విద్యార్థులు 99 శాతం ఉత్తీర్ణత శాతం సాధించారని ప్రిన్సిపాల్ ప్రవీణ తెలిపారు. 82 మంది బాలికలు పరీక్షలకు హాజరుకాగా ప్రథమ శ్రేణిలో 77 మంది, నలుగురు ద్వితీయ శ్రేణి సాధించారన్నారు. విద్యార్థిని కె.సాయి సింధు 578 మార్కులు, టి.సాహితి, ఎం.ప్రియాంక 571 మార్కులు సాధించారని చెప్పారు. వీరిలో 15 మంది 550 పైగా మార్కులు, 38 మంది 500లకుపైగా మార్కులు సాధించారన్నారు. సైన్స్‌లో ఒకరు, గణితంలో ఇద్దరు, సాంఘిక శాస్త్రంలో ఐదుగురు నూరు శాతం మార్కులు సాధించారని వివరించారు.

లూపింగ్ నెట్‌వర్క్‌తో కొండ ప్రాంతాలకు నీటి సరఫరా

భవానీపురం(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంతాలకు లూపింగ్ నెట్ వర్క్ డిజైన్‌తో నీటి సరఫరా చేస్తున్నట్లు మైసూర్ కార్పొరేషన్ డెప్యూటీ కమిషనర్ (డెవలప్‌మెంట్) కేజే సింధు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల స్టడీ టూర్‌లో భాగంగా ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ పర్యవేక్షణలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ల బృందం బుధవారం మైసూర్ నగరపాలక సంస్థ జోనల్ కార్యాలయంలో సమావేశమయ్యారు. సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా 84 డివిజన్లు, 9 జోన్లు కలిగిన మైసూర్ కార్పొరేషన్ పరిపాలన విధానం, మంచి నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, వివిధ ప్రాజెక్టుల అమలు, పార్కుల నిర్వహణ, కాలుష్య నివారణకు తీసుకున్న చర్యల గురించి సింధు వివరించారు. అదే విధంగా ప్రజల సమస్యల పరిష్కార విధానం, సంక్షేమ పథకాలు తదితర అంశాలకు సంబంధించిన వివరాలను అధికారులు సమగ్రంగా తెలియజేశారు. ఈ సందర్భంగా పలు కార్పొరేషన్ల అభివృద్ధి పనుల పరిశీలనలో భాగంగా తాము ఇక్కడకు రావడం సంతోషంగా ఉందని కార్పొరేటర్ల బృందం పేర్కొంది. విజయవాడ నగరంలో అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అక్కడి అధికారులకు వివరించారు.



మైసూర్‌లో హెడ్ వాటర్ వర్క్స్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ల బృందం

నెట్ వర్క్ డిజైన్..

అనంతరం మైసూర్ రామస్వామి సర్కిల్‌లోగల 45ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు కావేరీ డ్యామ్ నుంచి రా వాటర్ పంపింగ్ చేసుకుని, అక్కడ శుద్ధి చేసిన తర్వాత ప్రజలకు రక్షిత మంచినీటిని అందిస్తున్నామని వారు చెప్పారు. ఈ విధంగానే నాలుగు ప్రదేశాల్లో ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో కొండ ప్రాంతాలు ఎక్కువగా ఉన్నందున ఆ నెట్ వర్క్ డిజైన్‌ను ఇక్కడ అమలు చేస్తే ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చూడవచ్చని విజయవాడ కార్పొరేటర్ల బృందం అభిప్రాయపడింది.

విద్యార్థులకు పుస్తకాలు నేస్తాలు కావాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులకు పుస్తకాలు నేస్తాలు కావాలని, అప్పుడే విజ్ఞానంతో పాటు అనేక అంతర్గత శక్తుల ఉద్దీపన కూడా జరుగుతుందని ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగాధిపతి వెంపటి శ్రీసాయి అన్నారు. కేబీఎన్ కళాశాల తెలుగు, గ్రంథాలయ విభాగాల సంయుక్త నిర్వహణలో బుధవారం ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీసాయి మాట్లాడుతూ పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందన్నారు. జీవితంలోని ప్రతి దశలో విద్యార్థులకు తోడుగా ఉంటూ, భావోద్వేగాలను నియంత్రిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి మాట్లాడుతూ పుస్తక పఠనం జీవితాన్ని చక్కటి మలుపుతిప్పుతుందన్నారు. గ్రంథాలయ అధికారి శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఈ–బుక్స్ వంటి సాంకేతిక ఆవిష్కరణలు ఎన్ని వచ్చినా అవి పుస్తకానికి ప్రత్యామ్నాయం కాలేవన్నారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికితీయాలి



పటమట(విజయవాడ తూర్పు): బాల్యం నుంచి ఆట పాటలు, పుస్తక పఠనం ద్వారా వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయవచ్చని, వేసవి సెలవుల్లో పిల్లల్లో ఆసక్తి పెంచేందుకు ఇలాంటి కార్యక్రమం దోహద పడుతూ ఉందని పిల్లల వైద్య నిపుణులు శ్రీముఖి ఆశాభావం వ్యక్తం చేశారు. పటమట సర్వోత్తమ గ్రంథాలయంలో బుధవారం సాయంత్రం టాయ్ లైబ్రేరీని ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె ప్రారంభించారు. ఏపీ గ్రంథాలయ సంఘం కార్యదర్శి రావి శారద మాట్లాడుతూ ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా ఉచిత పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని, దానితో పాటు ఈ ఏడాది టాయ్ లైబ్రరీ ఏర్పాటు చేశామని అన్నారు. జూన్ 10వ తేదీ వరకు సాయంత్రం 4 నుంచి 6 సమయంలో పిల్లల్ని తీసుకుని వచ్చి వయసుకు తగ్గ ఆట వస్తువులు, బొమ్మలు సృజనాత్మక పెంచే పలు ఆసక్తి కరమైన కార్యక్రమాలు, పోటీలు జరుగుతాయని వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయం సంఘం అధ్యక్షులు కె. పట్టాభి రామయ్య, పలువురు సాహితీ వేత్తలు పాల్గొన్నారు.

శోభాయమానంగా వేంకటేశ్వరుని కల్యాణోత్సవం

నందిగామ రూరల్: మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న అలివేలుమంగ పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. బుధవారం సుప్రభాత సేవ, చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, తదితర కార్యక్రమాలను అర్చకుడు పరాశరం పవన్‌కుమార్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీ వేంకటేశ్వర సహిత సుదర్శన హోమాన్ని వేదోక్తంగా జరిపించారు. రాత్రికి లక్ష్మీనారాయణ కల్యాణం, మూలవరులకు పుష్పయాగం, ధ్వజావరోహణం, నక్షత్ర హారతి, పూర్ణాహుతి పూజలు, పవళింపు సేవ కార్యక్రమాలను నిర్వహించారు. మంగళవారం రాత్రి పలు రకాల పుష్పాలు, విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో వైఖానస సంప్రదాయం ప్రకారం స్వామి వారి కల్యాణాన్ని శోభాయమానంగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణ క్రతువులను జరిపించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ హనుమేశ్వరరావు, సూరె వెంకట రామారావు, అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.



కల్యాణ ఉత్సవమూర్తులు



కల్యాణ క్రతువు జరిపిస్తున్న దంపతులు

మెరిసిన త్రివిధ స్కూల్ విద్యార్థులు



బోనాల చరిత శ్రీ (594)

నూజివీడు: పదో తరగతి ఫలితాల్లో పట్టణంలోని త్రివిధ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ సబ్బినేని శ్రీనివాస్ బుధవారం తెలిపారు. పదో తరగతి పరీక్షలకు 202 మంది విద్యార్థులు హాజరవ్వగా 199 మంది ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. బోనాల చరితశ్రీ 594 మార్కులు, కె. సాయి రుత్విక్ 593, కె. భవ్యశ్రీ 591, డి. జస్వంత్ 591, పీఎస్ఎస్ రామ్‌చరణ్ 591, టి. కార్తీక, డి. అభిషయ్ శామ్యూల్ 590 మార్కులు సాధించారన్నారు. 550పైన మార్కులను 77 మంది విద్యార్థులు, 500 నుంచి 550 మార్కులను 64 మంది సాధించారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

కుమార్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



డివిజన్ ఫస్ట్ సాధించిన విద్యార్థిని కె. డింపుల్‌ను అభినందిస్తున్న స్కూల్ యాజమాన్యం

నూజివీడు: పట్టణంలోని కుమార్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ కనబరిచారని కుమార్ స్కూల్ చైర్మన్ పిన్నమనేని వెంకట కుమార్ తెలిపారు. పరీక్షకు 192 మంది హాజరుకాగా 188 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. కె. డింపుల్ 596 మార్కులు సాధించి డివిజన్ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. 8 మంది విద్యార్థులకు 590 పైన, 80 మంది విద్యార్థులకు 550 మార్కులకు పైగా వచ్చాయన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను చైర్మన్ వెంకట కుమార్‌తో పాటు కరస్పాండెంట్ పిన్నమనేని సంధ్యాలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

చరిత్ర సృష్టిస్తున్న మైలవరం విద్యార్థులు



పసుపులేటి నందిని

మైలవరం: మైలవరం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో పోటీ పడి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. ఇటీవల ఇంటర్‌లో మైలవరం మండలం వెదురుబీడెంకు చెందిన భూక్యా హారిణి ఇంటర్‌లో రాష్ట్ర స్థాయిలో ఉన్న హైస్కూల్స్ ప్లస్‌లలో ప్రథమ స్థానంలో నిలిచి తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచింది. అదే విధంగా ప్రస్తుతం పదో తరగతిలో మైలవరం ఎంబీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పసుపులేటి నందిని 600 మార్కులకు గాను 593 మార్కులు సాధించింది. చిలుకూరువారిగూడెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని వి.జ్యోతి ప్రసన్న 584 మార్కులు సాధించి ద్వితీయ స్థానం, వెల్వడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బి. మహీంద్ర 566 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచాడు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పీఆర్‌టీయూ మైలవరం మండల శాఖ నాయకులు కె.కోటేశ్వరరావు, ఆర్‌వీఎస్ రామకృష్ణారావు, మండల కార్యవర్గం అభినందించారు.

ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు శ్రేయస్కరం



వీరులపాడు: ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవం శ్రేయస్కరమని జిల్లా వైద్యాధికారి సుహాసిని పేర్కొన్నారు. మండలంలోని అల్లూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో కాన్పులు జరిగేలా వైద్యారోగ్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై ప్రజలకు నమ్మకం కలిగించేలా వైద్యులు, సిబ్బంది పని తీరు కనబర్చాలని తెలిపారు. సుఖ ప్రసవాలు జరిగేలా చూడాలని సూచించారు. గ్రామాల్లో గర్భిణులను గుర్తించి ఎప్పటికప్పుడు వైద్య సేవలు పొందేలా, పౌష్టికాహారం తీసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఆరోగ్య కేంద్రాలకు వచ్చే రోగుల పట్ల మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని చెప్పారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్యాధికారి రవికిరణ్ రెడ్డి, ఎంపీహెచ్‌వో చంద్రశేఖర్, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పటమట(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ జీవితంలో క్రీడలకు అత్యున్నత స్థానం ఇవ్వాలని, ఉద్యోగులు కూడా క్రీడల్లో పాల్గొనటం ద్వారా మానసిక, శారీరక ఒత్తిడి తగ్గుతుందని కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి పి. కృష్ణయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి క్రీడాపోటీలను ఆయన సాయిసందీప్ బ్యాడ్మింటన్ అకాడమీలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభకు వయస్సు అడ్డుకాదని, ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలని అన్నారు. అనంతరం ఆయన పీసీబీ ఉద్యోగులకు క్రికెట్, బ్యాడ్మింటన్, కేరమ్స్, చెస్, పరుగు పోటీలను ప్రారంభించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 27వ తేదీన విశాఖపట్నం వేదికగా ఫైనల్ పోటీలు జరుగుతాయని అన్నారు.

టెన్త్‌లో సత్తా చాటిన ప్రభుత్వ విద్యార్థులు



దేవరకొండ జోత్స్న (581) | నాగమనస్విని (580) | బండి యస్విని (577) | 23ఎంవైఎం24ఎ: గొల్ల ప్రణీత (582) | పరసా రేవతి (576) | అందె అక్షయ (577) | ఎం. సుష్మ (577)

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర విద్యా శాఖ బుధవారం విడుదల చేసిన టెన్త్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన బాలబాలికలు సత్తా చాటారు. కొండపల్లి జెడ్పీ బాలికల పాఠశాల విద్యార్థినులు దేవరకొండ జోత్స్న 581/600 మార్కులు, ఎం.నాగమనస్విని 580, బండి యశ్విని 577, మహాత్మ జ్యోతి బాపూలే బీసీ గురుకుల పాఠశాలకు చెందిన జి. రామ్‌చరణ్ 579, ఎం.అరుణ్‌కుమార్ 577, ఆర్. రేవంత్‌కృష్ణ 576 మార్కులతో మండల స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 1,212 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 1,096 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 67 శాతం, ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో 97 శాతం, ప్రైవేట్ స్కూల్స్ 92 శాతం మొత్తం 85.63 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ సీహెచ్ పుష్పలత తెలిపారు.

కోడూరు హైస్కూల్లో నూరు శాతం ఉత్తీర్ణత..

జి.కొండూరు: పదో తరగతి ఫలితాల్లో జి.కొండూరు మండల పరిధి కోడూరు జెడ్పీ హైస్కూల్లో 35 మంది విద్యార్థులు ఇంగ్లిషు మీడియంలో పరీక్షలు రాయగా వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో గొల్ల ప్రణీత 582 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఇదే పాఠశాలకు చెందిన సాలి యువచరణ్ 563 మార్కులతో తృతీయస్థానంలో నిలవగా వెలగలేరు హైస్కూల్‌కు చెందిన అనుముల లలితశ్రీ 567 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచింది. మండల పరిధిలో మొత్తం 13 ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 80.16 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

చాట్రాయి మండలంలో 85 శాతం ఉత్తీర్ణత

చాట్రాయి: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 85 శాతం ఉత్తీర్ణత సాధించారు. 319 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 257 మంది ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాల చిన్నంపేట హైస్కూల్ విద్యార్థిని పరసా రేవతి 576 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. మర్లపాలెం హైస్కూల్ విద్యార్థిని గుర్రం నిఖిల 575 మార్కులతో స్థానం సాధించింది. ప్రైవేటు పాఠశాలల్లో చాట్రాయి వికాస్ హైస్కూల్‌కి చెందిన అందె అక్షయ 577 మార్కులు, చనుబండ ఉషోదయ హైస్కూల్ విద్యార్థి కోపూరి తిరుపతి రావు 576 మార్కులు సాధించాడు. సి గుడిపాడు హైస్కూల్ విద్యార్థులు 24 మంది పరీక్షలు రాయగా నూరు శాతం ఉత్తీర్ణులయ్యారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పుచ్చకాయల సుబ్బారెడ్డి, సర్పంచ్ విస్సంపల్లి ప్రశాంతి, ఎంఈఓ బ్రహ్మాచారి విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు.

నూజివీడు పట్టణం, మండలంలో..

నూజివీడు: పట్టణం, మండలంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో ప్రతిభను కనబరిచారు. మండలంలోని దిగవల్లి హైస్కూల్‌కు చెందిన 22 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా నూరుశాతం ఉత్తీర్ణులయ్యారు. ఈ పాఠశాలకు చెందిన బి. సంజన 571 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచింది. పట్టణంలోని జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌కు చెందిన విద్యార్థులు 224 మంది పరీక్ష రాయగా 161 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎం. సుష్మ 577 మార్కులు, ఎన్. కవిత 574, కె. సులోచన 574 మార్కులు సాధించారు. గొల్లపల్లి హైస్కూల్‌లో 71 మందికి 42 మంది, ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో 161 మందికి 93 మంది, పల్లెర్లమూడి హైస్కూల్‌లో 66 మందికి 58 మంది, యనమదల హైస్కూల్‌లో 37 మందికి 29 మంది, మీర్జాపురం హైస్కూల్‌లో 126 మందికి 77 మంది, అన్నవరం హైస్కూల్‌లో 31 మందికి 20 మంది, కోటవారిగూడెం హైస్కూల్‌లో 19 మంది, దేవరగుంట హైస్కూల్‌లో 25 మందికి 15 మంది, గురుకుల పాఠశాలలో 80 మందికి 64 మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పాఠశాలకు చెందిన పి. దేవి హర్షిత 578 మార్కులు సాధించారు.

సాయి ప్రణీత విజయభేరి

నూజివీడు: పదో తరగతి ఫలితాల్లో పట్టణంలోని శ్రీ సాయిప్రణీత హైస్కూల్ విద్యార్థులు విజయభేరి మోగించారని ప్రిన్సిపాల్ కానూరి అనురాధ తెలిపారు. 36 మంది విద్యార్థులు పరీక్ష రాయగా నూరు శాతం ఉత్తీర్ణులయ్యారన్నారు. ఎం. గాయత్రీ 586 మార్కులు, వి. లిపిక 580 మార్కులు సాధించారు. 36 మందిలో 18 మంది 500లకు పైగా మార్కులు సాధించారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు కరస్పాండెంట్ కానూరి సాయి ఫణీంద్ర అభినందించారు.

మండల టాపర్ వివేకానంద విద్యార్థి

జి.కొండూరు: పదో తరగతి ఫలితాల్లో స్థానిక వివేకానంద ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థి పి. వెంకట చైతన్య 587మార్కులతో మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. ఈ పాఠశాల నుంచి 49 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 25 మంది విద్యార్థులు 500కి పైగా మార్కులు సాధించారని పాఠశాల డైరెక్టర్ మల్లెల శ్రీనివాస రావు, కరస్పాండెంట్ మల్లెల ఈశ్వరరావు తెలిపారు.

● ఆత్మీయ కలయిక



వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అప్పిడి కిరణ్‌కుమార్ రెడ్డి తాడేపల్లిలోని జగన్ నివాసంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ పలు సూచనలు చేశారు. –మైలవరం